





# దీక్షా దక్షతలకు కేసీఆర్ ఆదర్శం

"తెలంగాణ ఉద్యమ చరిత్రను మరో మలుపు తిప్పిన్రు కేసీఆర్. ఆయన నాడు (నవంబర్ 29, 2009) చేపట్టిన దీక్ష కోట్లాది మందికి స్ఫూర్తి. అనంతరం, తెలంగాణ ఏర్పాటు దిశగా సాగిన పయనం ఏ తెలంగాణ వాది మరిచిపోలేనిది. ఆ మలుపు యాదిలో బీఆర్ఎస్ పార్టీ నగరంలో పెద్ద ఎత్తున నగరంలో దీక్షా దివస్‌ను చేపట్టింది. ఈ నేపథ్యంలో నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న కేసీఆర్ పట్టుదల, కార్యదక్షతపై ప్రతి కార్యకర్త జయజయ ధ్వానాలతో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. బీఆర్ఎస్ పార్టీ పోరాట పటిమ, కేసీఆర్ దీక్ష బూనిన విధాన్ని ఒకసారి మననం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల బైక్, కార్ల ర్యాలీలు చేపట్టి పార్టీ నేతలు బీఆర్ఎస్ భవన్ వరకు వేలాదిగా తరలివచ్చారు. ఐదారు కిలో మీటర్ల మేర వాహనాల ర్యాలీలను మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి తదితర నేతలు చేపట్టారు. తెలంగాణ కలను సాకారం చేసిన ధీరోదాత్తుడు.. కేసీఆర్, తెలంగాణ బాపు, తెలంగాణ జాతిపిత అంటూ పలువురు నాయకులను కార్యకర్తల దాకా పెద్ద పెట్టున నినాదాలిచ్చారు."















సెయింట్ జార్జెస్ స్కూల్స్ 190వ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్లు

## విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ తీర్చిదిద్దాలి

- వైభవంగా సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవం
- 190వ వేడుకలో మెదక్ ఇన్‌చార్జ్ బిషప్ డయోసిస్ రైట్‌రేవ్ ప్రొ. కె.రియోబిన్ మార్క్

అబిడ్స్, నవంబర్ 29: విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాలలో తీర్చిదిద్దడమే సెయింట్ జార్జెస్ స్కూల్స్ ఉద్దేశమని మెదక్ ఇన్‌చార్జ్ బిషప్ డయోసిస్ రైట్‌రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్ పేర్కొన్నారు. అబిడ్స్ గ్రామర్ స్కూల్ ఆవరణంలో సెయింట్ జార్జెస్ స్కూల్స్ 190వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ రియోబిన్ మార్క్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని తెలిపారు. నైటింగేల్ సరోజినీ నాయుడుతో పాటు పలువురు ప్రముఖులు విద్యను అభ్యసించారని తెలిపారు. తమ విద్యా సంస్థల 190వ వేడుకలను జరుపుకోవడం తమకేంత సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో.. సమాజ సేవలు, క్రీడలతో పాటు పలు రంగాలలో కూడా స్వయంగా అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. వందేండ్ల క్రితమే సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ బాలికల కోసం ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుత కాలంలో 'బేటి బచావో.. బేటి పడావో' ప్రచారం జరుగుతుందని తమ విద్యా సంస్థలలో వందేండ్ల క్రితమే ఈ నినాదాన్ని నెరవేర్చామన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ మహిళా రంగానికి సెయింట్ జార్జెస్ స్కూల్స్ పెద్ద పీట వేసిందన్నారు.

### సావనీర్ క్యాలెండర్ ఆవిష్కరణ..

190 ఏండ్ల సావనీర్‌తో పాటు మెదక్ చర్చ్ 2025వ సంవత్సరం కాలెండర్‌ను రైట్‌రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్, రేవ్ డాక్టర్ కె.ప్రైసిల్లా పర్విల్లా రియోబిన్ మార్క్ రేవ్ డాక్టర్ పి.సోలమన్ రాజ్, జి.ఈబర్ జయపాల్, జాన్ జనార్దన్, ఉదయ్ కుమార్, మంత్రి సోలమన్ రాజ్, జి.ప్రభుకిరణ్,జయానంద్ మినిస్టర్లతో పాటు పలువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథి ఆర్ సత్యానందం, ప్రిన్సిపాల్స్ బి.రూత్ లజ్జావతి, వార్డెన్, కరస్పాండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్లు ఘనంగా సత్కరించి విద్యా సంస్థల ప్రగతిని వెల్లడించారు.

### అకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు...

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అకట్టుకున్నాయి. రేవ్ డాక్టర్ ప్రెస్కుల్లా పర్విల్లా రూబెన్ మార్క్ మెదక్ డయాసిస్ మొదటి మహిళ జ్యోతి ప్రజ్వలను చేసి 190 ఏండ్ల సంబురాలను ఒక వేడుకగా ప్రారంభించారు.

## ఆగని అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 29: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన పదెకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళన జరుగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా యూనివర్సిటీ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, నేతలు డా. రవీంద్రనాథ్ సోలమన్, డా. ఉదయిని. డి.వసంతరావు, డా. కిషోర్, డా. అంబేద్కర్, డా.రజిత, పాండు, రాములు పాల్గొన్నారు.

## విష్ణు విస్తారాలో టౌన్ ప్లానింగ్ తనిఖీలు

- కాలమ్స్, ఫిల్లర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఫ్లాట్స్ ఓనర్ల ఫిర్యాదులు
- సెల్లార్‌లోకి సీపేజ్ వాటర్ వస్తున్నట్లు గుర్తింపు
- నిర్మాణ సామర్థ్యంపై శాంపిల్స్ సేకరణ



సిటీబ్యూరో, నవంబర్ 29(నమస్తే తెలంగాణ): మాదాపూర్ భాగ్యనగర్ కాలనీ విష్ణు మార్గ్‌లోని సర్వే నం.1002లో నిర్మించిన హైరైజ్ బిల్డింగ్ విష్ణు విస్తారాను శుక్రవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ బృందాలు తనిఖీలు చేశాయి. విష్ణు విస్తారా అపార్ట్‌మెంట్ ఏ అండ్ బీ బ్లాక్స్ ఫ్లాట్ ఓనర్స్ మ్యుచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ మెయింటనెన్స్ ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేశారు. కైత్లాపూర్ విలేజ్ సర్వే నం. 1002లో విష్ణు విస్తారా 2014లో అనుమతి తీసుకుని ఏ, బీ బ్లాకులలో నిర్మాణం చేపట్టారు. ఏ, బీ బ్లాక్‌లో గ్రౌండ్ అప్పర్ 14 అంతస్తులు, రెండు సెల్లార్లతో నిర్మాణం జరిగింది. ఈ హైరైజ్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 2023లో అక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) ఇచ్చింది. ఐతే, ఈ నిర్మాణంలో కాలమ్స్ నిబంధనల మేరకు పనులు జరగలేదని, లోప భూయిష్ఠంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేపట్టారని, కాలమ్స్ ప్రమాదకర స్థాయిలో పగుళ్లు, భవనం ఒంగి ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నామని సతీశ్ రెడ్డి అనే ఫిర్యాదుదారుడు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సమగ్ర నివేదిక ఆందోళనకరంగా ఉందని, సెల్లార్‌లో వాటర్ రావడం, ఇందులో 238 ఫ్లాట్స్‌లో ఉంటున్న 1000 మంది నివాసితుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అధికారులకు మొర పెట్టుకున్నారు. తనిఖీలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఓనర్స్, నిర్మాణదారుడిల మధ్య సమన్వయ లోపంతో పాటు పక్కనే ఉన్న నాలా నుంచి సీపేజ్ వాటర్ వస్తుందని, నిర్మాణంలో ఎలాంటి తేడా లేదని తేల్చారు. ఈ క్రమంలోనే నిర్మాణ సామర్థ్యంపై శాంపిల్స్ సేకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు నిర్మాణదారుడి పట్ల జీహెచ్ఎంసీ ఏ విధంగా వ్యవహరిస్తుందోనని చర్చ జరుగుతున్నది.

## ఓయూ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల భారీ ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఓయూ స్టూడెంట్స్ ఎజెండాపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. సీఎం ఓయూను సందర్శించి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల మెస్ డిపాజిట్ల విధానాన్ని రద్దు చేసి, ఉచిత మెస్, వసతి కల్పించాలన్నారు. ఓయూ చదువుతున్న పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆరోగ్య బీమా ఇవ్వాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలన్నారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, ఓయూ అధ్యక్షురాలు స్వాతి, ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, నాయకులు వెంకటేశ్, అంజి, సంతోష్, క్రాంతి, తిరుపతి, పవన్, సాయికుమార్, రంజిత్, భువన, శ్రావణి, తిరుమలి, ప్రశాంత్, విజయ్, బాలకృష్ణ, కార్తీక్ రెడ్డి, నితిన్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఎల్‌ఆర్‌ఐటీలో ఈక్వినాక్స్-2కే24



ఈక్వినాక్స్-2కే24 కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి తదితరులు

దుండిగల్, నవంబర్ 29: నగర శివారు దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ)కళాశాలలో ఈక్వినాక్స్, ఈ సమ్మిట్ 2కే24 కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే, కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రేయారెడ్డి, ధీరేన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కే.శ్రీనివాసరావు, డీన్ డా. రాధికాదేవి, కో–ఫౌండర్, టాలెంట్ ఫార్మ్ పంకజ్ దివాన్, బడాఘర్ వాలా ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటార్ మనోజ్ కుమార్, టీ వర్క్స్ సోషల్ ఇన్నోవేషన్ లీడ్, హేమ బాలకృష్ణన్, నాస్కామ్ ఏఐ డిప్యూటీ డైరెక్టర్, ప్రవీణ్ మొక్కపాటి, సీఐఈ ఇన్‌చార్జ్ డా.బలరామ్ ఎలమశెట్టిలు పాల్గొన్నారు. ఈక్వినాక్స్–2కే24 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2వ రోజు విశిష్ట ఆవిష్కరణలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా డా. సూరజ్, బాల ప్రసాద్ పెద్ది గారి, మనీశ్ గుప్తా తదితరులు విద్యార్థులకు పలు మెలకువలు అందించారు. వ్యూహాత్మక ఆలోచనలను పరీక్షించడం, హస్టిల్ మేనియా, మార్కెటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించడం, క్రాస్ రోడ్స్, టీమ్ వర్క్‌ను ప్రోత్సహించడం, బ్రాండ్ బ్యాటిల్స్, విమర్శనాత్మక ఆలోచనలను హైలైట్ చేయడం వంటివి క్యాంపస్‌లో సందడి చేశాయి. ఈ సందర్భంగా హాస్యనటుడు హృదయ్ రంజన్ నిర్వహించిన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఆర్‌ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, తమ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారిని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తూ రూపొందించిన ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

## ఐఈఎస్‌లో రోహిత్‌కు ఫస్ట్ ర్యాంక్

- అత్యుత్తమంగా నిల్చిన నారాయణ స్కూల్స్ పూర్వ విద్యార్థి

సిటీబ్యూరో, నవంబర్ 29(నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) 2024 సివిల్ ఇంజనీరింగ్‌లో నారాయణ స్కూల్స్ పూర్వ విద్యార్థి రోహిత్ దోండ్గే ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారని నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ డా. పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణలు తెలిపారు. నారాయణ స్కూల్‌లోని బేసిక్ కాన్సెప్ట్స్‌పై వేసిన స్ట్రాంగ్ ఫౌండేషన్, నారాయణ ప్రోగ్రామ్స్, టీచింగ్ రోహిత్ విజయానికి ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. రోహిత్ విజయం ఎంతో మంది యువ మనసుల్లో స్ఫూర్తిని నింపుతుందన్నారు. ఇంజనీరింగ్ పట్ల మక్కువ, క్రమశిక్షణ, ఏకాగ్రతే రోహిత్‌కు ఈ గుర్తింపు తెచ్చి పెట్టిందని వారన్నారు. ఎప్పటిలాగే నారాయణ స్కూల్‌లో నాణ్యమైన విద్యను అందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ప్రతి రంగంలో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు రోహిత్ దోండ్గే అతని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.